క్లుప్తంగా

ఆలయాలకు మంచినీటి వసతి


కుళాయిలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక పైడిమాంబ ఆలయం, కొండయ్యవలస రామాలయం, దిబ్బపాలెంలోని బొర్రమ్మ గుడి, రామాలయం వద్ద మంచినీటి కుళాయిలను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆలయాల ఆవరణలో జీవీఎంసీ నిధులతో దశల వారీగా మంచి నీటి కుళాయిలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ముందుగా నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయాల వద్ద వీటిని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, గెద్దాడ సత్యవతి, విందుల నారాయణరావు, సత్యనారాయణ, అమరపిని గోవిందరావు, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీవీఆర్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ డీవీఆర్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. యూనియన్ ఏర్పాటు చేసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆరేళ్లుగా యూనియన్ పని చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దల్లి శ్రీనివాస్, పేర్ల నూకరాజు, టి.వి. శంకరరావు, సూర్యనారాయణ, మజ్జి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పెళ్లిరాట


భక్తాంజనేయస్వామి వారి ఆలయం వద్ద పెళ్లిరాట వేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 30న శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆలయ ఆవరణలో సోమవారం పందిరి రాట వేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కన్నేపల్లి సీతాపతి శర్మ మాట్లాడుతూ ఏటా ఈ ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


మహిళకు చీర అందిస్తున్న కుంచయ్యరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని సిద్ధేశ్వరం శివారు ముసలినాయుడుపాలెంలో కొలువుదీరిన నూకాంబిక ఆలయంలో అమ్మవారి ఉత్సవాలను ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గొందేశి కుంచయ్యరెడ్డి చేతుల మీదుగా పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిట్టా అప్పారావు, వి.సూర్యచంద్రరావు, పులి పైడిరెడ్డి, తాతారావు, తోకాడ అప్పారావు పాల్గొన్నారు.

100% ఉత్తీర్ణతే లక్ష్యంగా..

ప్రతీ విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అదే తొలిమెట్టు. దీంతో ప్రతీ విద్యార్థి టెన్త్ పరీక్షలు అనగానే ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కానీ, మొదటిసారి పబ్లిక్ పరీక్షలనే టెన్షన్. ఒత్తిడిని జయించి, ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులను సాధించవచ్చంటున్నారు నిపుణులు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికను రూపకల్పన చేసి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు ఉపాధ్యాయులు. కణితి జెడ్పీ పాఠశాలలోనూ దీనిని అనుసరిస్తూ, శతశాతం ఉత్తీర్ణత సాధిస్తామంటున్నారు.


ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి
- ఒత్తిడిని జయించేలా కౌన్సెలింగ్

కూర్మన్నపాలెం: పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానుండటంతో విద్యార్థులంతా చదువుపైనే దృష్టి సారించారు. కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధారణ తరగతులతో పాటు సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు ఏ సబెక్టులో మార్కులు తగ్గుతున్నాయో గుర్తిస్తూ.. ఆ సబెక్టులను మరింత అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా..

పదో తరగతి పరీక్షలకు సంసిద్ధమయ్యే విద్యార్థుల కోసం డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్(డీసీఈబీ) ఉపాధ్యాయులకు ప్రణాళికలను అందించింది. విద్యార్థులు ఏ రోజు, ఏ సబెక్టు, ఏ చాప్టర్ చదవాలనే అంశాలను వివరిస్తూ రూపొందించిన ప్రణాలను పాఠశాలలకు పంపించింది. జిల్లా విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపాల్ ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నా పత్రాలతో కూడిన డీసీఈబీ పుస్తకాలను అందిస్తున్నారు. శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లోనూ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల క్లాసులను ప్రారంభించి, సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అనంతరం ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌ను నిర్వహించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు సహచర విద్యార్థులతో కలిపి గ్రూప్ డిస్కషన్ చేయిస్తున్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలను, గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తూ.. వారిని సంసిద్ధులను చేస్తున్నారు.


కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయిని

కౌన్సెలింగ్

విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు మానసిక శాస్త్ర నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. తల్లిదండ్రులతోనూ మాట్లాడి, ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా చూస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం



ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలని కృషి చేస్తున్నాం. విద్యార్థులకు మోడల్ పేపర్లు తయారుచేసి, పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆ పేపర్లలో వారు చేసిన తప్పులను వివరిస్తున్నాం. ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో గమనిస్తూ, ఆ పాఠాలను మళ్లీ బోధిస్తున్నాం. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, విద్యార్థి చదువుపై మరింత దృష్టి పెట్టేలా అవగాహన కల్పిస్తున్నాం. గ్రూప్ డిస్కషన్లు నిర్వహించడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. అనంతరం వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

– పి.శ్రీనివాసరావు, ఇంగ్లిష్ టీచర్

పరీక్షల భయం తగ్గింది



తరచూ పరీక్షలు రాస్తుండటంతో పరీక్షల భయం తగ్గింది. ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు వస్తే, సాయంత్రం 5.30 గంటలకు మళ్లీ ఇంటికి వెళ్తున్నాం. మధ్యాహ్నం భోజనంతో పాటు సాయంత్రం అల్పాహారాన్ని సైతం పాఠశాలలోనే ఏర్పాటు చేయడంతో సమయం ఎక్కడా వృథా కావడంలేదు. ఉపాధ్యాయులంతా ఎంతో శ్రద్ధతో మాకు బోధిస్తున్నారు. మంచి మార్కులు వస్తాయని నమ్మకం పెరిగింది.

– ఇల్లపు సోనియా, విద్యార్థిని

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతీ విద్యార్థిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. మా పాఠశాలలో 266 మంది విద్యార్థులున్నారు. వారిలో 90 మంది తెలుగు మీడియం, 176 మంది ఇంగ్లిష్ మీడియం చదువుతున్నారు. ప్రతీ సెక్షన్‌కు ఒక క్లాస్ టీచరును నియమించి, ప్రతి సెక్షన్‌కు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, వారి సందేహాలను వాట్సాప్ గ్రూప్ ద్వారా నివృత్తి చేస్తున్నాం. దీంతో విద్యార్థుల సందేహాలు నివృత్తి కావడంతో పాటు మిగిలిన వారు కూడా మరింత నేర్చుకుంటున్నారు. చదువులో వెనకబడి ఉన్న ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక టీచరును ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ఈ ఏడాది మంచి మంచి ఫలితాలు సాధిస్తామని భావిస్తున్నాం.

–ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు

సీడబ్ల్యూసీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలి'

అగనంపూడి: ఉక్కు నిర్వాసిత కాలనీల్లోని సీడబ్ల్యూసీలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఉక్కు యాజమాన్యం వాటాగా విడుదల చేసే ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సిటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. ఈ విషయంలో యాజమాన్యం తీరు మార్చుకోవాలన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీ పాత కమిటీ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులు, ఉద్యోగుల మానసిక ఉల్లాసం, పిల్లల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు నాలుగు నిర్వాసిత కాలనీల్లో సీడబ్ల్యూసీలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీని కోసం ప్రతీ నెలా కార్మికుల జీతాల నుంచి మినహాయిస్తున్న నిధులతో పాటు యాజమాన్యం కూడా గతంలో ప్రత్యేక నిధులు విడుదల చేసేదని, అయితే కొంతకాలంగా నిధుల కేటాయింపులకు మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. సీడబ్ల్యూసీ అధ్యక్షుడు జయరాజు, మాజీ కార్యదర్శి వంకర రాము తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణారావు, గుడే సుశీలా గజేంద్రరావు, పెదిరెడ్ల నీలకంఠం, బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


సీడబ్ల్యూసీ పాత కమిటీని సత్కరిస్తున్న ప్రస్తుత ప్రతినిధులు

లంకెలపాలెంలో ఆధార్ ప్రత్యేక క్యాంప్ నేడు

అగనంపూడి: లంకెలపాలెం రామాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ఉదయం ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉంటున్న ఈ కేంద్రంలో ఐదు సంవత్సరాల లోపు బాలలకు ఆధార్ నమోదుతో పాటు ఆధార్ కార్డుకు ఫోన్ అనుసంధానం కూడా చేస్తారు. 79, 85 వార్డుల పరిధిలోని వారు ఈ కేంద్రాన్ని సద్వినియోగ పరచుకోవాలని వార్డు సచివాలయ సిబ్బంది కోరారు.

సీఎంఆర్ పార్కింగ్ వేలం రూ.1.57 లక్షలు

గాజువాక: పాతగాజువాక సమీపంలోని సీఎంఆర్ సెంట్రల్ వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు జీవీఎంసీ అధికారులు సోమవారం వేలంపాట నిర్వహించారు. కనీస పాట రూ.1లక్షతో ప్రారంభించగా, పార్థు అనే పాటదారుడు రూ.1.57లక్షలకు పాడుకున్నట్టు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ సూపరింటెండెంట్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సరఫరా మ్యాపింగ్‌కు వినతి


సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కాలనీపెద్దలు

గాజువాక: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్ కాలనీలో రైస్ వ్యాన్ ద్వారా బియ్యం పంపిణీకి మ్యాపింగ్ చేయాలని కోరుతూ ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. తిరుమలనగర్‌లోని సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీని కలిసి బియ్యం తీసుకోవడానికి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. మ్యాపింగ్ జరగలేదనే కారణంతో తమ కాలనీవాసులకు బియ్యం సరఫరా సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

కమనీయం .. కల్యాణం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని రైల్వే వ్యాగన్ రిపేర్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆటోనగర్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కంపెనీ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్లు కలిసి, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు వర్తించవలసిన వాటిపై ప్రశ్నించిన వారిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. విధుల్లో ప్రమాదానికి గురైతే, వారికి మెడికల్ బెనిఫిట్స్, నష్టపరిహారం కాని అమలు చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఎ.లోకేష్, కంపెనీ కార్మికులు అవతారం, గోపి, మహేష్, నానాజీ పాల్గొన్నారు.


ఆందోళన తెలుపుతున్న యూనియన్ ప్రతినిధులు, కార్మికులు

వైభవంగా సీతారామచంద్రస్వామి తిరువీధి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసీతారామచంద్రస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మణ, హనుమ సహిత స్వామివారి ఉత్సవ మూర్తులను కాలనీలోని పలు సెక్టార్లలో ఊరేగించారు. ఈ నెల 30న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయవర్గాలు తెలిపాయి.

ఘనంగా పోలమాంబ పందిరి రాట వేడుక

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరలో భాగంగా సోమవారం పందిరిరాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, గేదెల లావణ్య, ఎన్.నూకత్నం, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, ఈవో సురేష్‌బాబా పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయంలో భాగంగా పుట్టబంగారం తీసుకువచ్చే కార్యక్రమం(దేవర పండగ) సోమవారం నిర్వహించారు. వచ్చేనెల 3న తొలేళ్ల పండగ, 4న అనుపు మహోత్సవం నిర్వహించనున్నారు.


పందిరి రాట వేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

774వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ కార్మికుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిరసనలు చేపట్టి సోమవారానికి 774వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్ఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లెతై విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని, లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. ఈ మేరకు సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద ఛలో ఢిల్లీ గోడప్రతులను సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అంధకారంలోకి నెట్టబడుతోందన్నారు. ప్రపంచంలోనే ప్రజల నమ్మకాన్ని, గౌరవాన్ని గెలుచుకున్న ఎల్ఐసీ వంటి సంస్థలనూ అమ్మకానికి పెట్టారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కూడా వ్యూహాత్మక అమ్మకానికి పెట్టిందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని, వీటి రక్షణ కోసం ప్రజలు, కార్మిక వర్గం, కర్షక లోకం ఐక్యంగా ప్రతిఘటించాల్సి ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, గంగాధర్, డి. కృష్ణమూర్తి, కె.వి. సత్యనారాయణ, యు. మరిడయ్య, బి.ఎస్. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వేలం నేటికి వాయిదా

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రోడ్ మార్జిన్ ఆశీలు వసూలుకు ఏర్పాటు చేసిన వేలంపాట వాయిదా పడింది. సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ పి.సింహాచలం ముందుగానే ప్రకటించారు. ఈ వేలంపాటలో పాల్గొనేందుకు కొంతమంది డిపాజిట్ చెల్లించినప్పటికీ, వారు సకాలంలో హాజరు కాలేదు. వచ్చినవారిలో కూడా కొంతమంది తక్కువ ధరకు పాడటానికి రింగ్ అయ్యారనే అనుమానం రావడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్టు జెడ్సీ ప్రకటించారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు తగిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలియజేశారు.


వేలం పాట నిర్వహణకు సిద్ధమైన జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

అగనంపూడి: గాజువాకకు చెందిన సమతా రోటరీ క్లబ్ ప్రతినిధులు అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు జాన్‌డీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్టర్ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అట్ట, స్కేల్, పెన్సిల్ తదితర రాత సామగ్రిని అందజేశారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.సూర్యనారాయణ, ప్రతినిధులు లక్ష్మణరావు, సిరట్ల శ్రీనివాస్, సత్యవేణి, ఆకుల రామకృష్ణ, పాలపర్తి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష సామగ్రిని అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనపై గాజువాక క్రైం పోలీసులు, బాధితుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివేకానంద వీధిలో మొదటి అంతస్తులో నివసిస్తున్న పిల్లా రమణ, చినతల్లి దంపతులు శుక్రవారం నేపాల్ పర్యటనకు వెళ్లారు. శనివారం వారి ఇంటికి ఓ బంధువు రాగా ఇంటి మెయిన్‌గేట్ తాళంతో పాటు బెడ్ రూమ్ లాక్ విరిగిపోవడం, బీరువాలో లాకర్ తెరిచి ఉండడం కనిపించింది. దీంతో గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఆదివారం ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. బీరువాలో డబ్బు, బంగారం దాచుకునే లాకర్ మాత్రమే తెరిచి ఉందని, ఇంటి యజమాని వస్తే గానీ, ఏమేం వస్తువులు అపహరించారో తెలియదని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.


తెరిచి ఉన్న బీరువా


దొంగలు విరగ్గొట్టిన లాకర్

డిగ్రీలతో పాటు నైపుణ్యాలూ ప్రధానం

ఏయూ క్యాంపస్: అత్యంత పోటీ ప్రపంచం యువతకు ఆహ్వానం పలుకుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి తరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. వ్యాపారాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. సాంకేతికత మార్పులు యువతకు సవాళ్లు విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే దిశగా కృషి జరగాలని ఆచార్యులకు సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ ఇంటిలిజెన్స్ రంగాలు భవిష్యత్ సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఈసీఈ విద్యార్థులు అడుగు పెట్టాలన్నారు. ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జీవీపీ కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అన్ని రంగాలలో ఏయూ అద్భుతమైన ప్రగతిని చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్ బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, డాక్టర అరుణ, డాక్టర్ పి.వి.శ్రీదేవి, ఆచార్య కె.రమాసుధ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి